క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



శాయంపేట : మండలంలోని మందారిపేట గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు కుక్కల మహేష్ తండ్రి మొండయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవీందర్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్, కిరణ్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. వారి వెంట నాయకులు మొగిలి, రామకృష్ణ, విద్యాసాగర్, సుమన్, రాకేష్‌రెడ్డి ఉన్నారు.



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌కు చెందిన పోలు అశోక్ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అశోక్ భార్య స్వప్నతో కలిసి భీంపల్లిలో 2008–09లో పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఈ మేరకు రూ.18,500 నగదును ఆర్థికసాయంగా అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో అప్పయ్యస్వాముల సామూహిక మహా పడిపూజ ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి ఆధ్వర్యంలో మొదట విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంబీమాత పూజ చేసి ధర్మశాస్త్ర అయ్యప్పకు పంచద్రవ్యాలు, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్లతో పాటు నది జలాలతో ఘనంగా అభిషేకించారు. అనంతరం 18 మెట్లపై పడి వెలిగించి శరణు వేడుకున్నారు. అనంతరం గురుస్వామి పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులందరికీ తీర్థ ప్రసాదాలు అందించారు. అందరి సహకారంతో నిర్వహించిన పడిపూజ ఉద్దేశించి ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని గురుస్వామి ఆశీర్వచనాలు అందించారు. సుమారు 600 మంది భక్తులు హాజరుకాగా స్వామి వారి తీర్థ ప్రసాదాలతో పాటు భోజనం స్వీకరించారు.

ఉద్యోగుల ఐక్యతను దెబ్బతీయొద్దు


ఐనవోలు : ఉద్యోగుల ఐక్యతను నూతన రెవెన్యూ సంఘాలు దెబ్బతీయొద్దని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) జిల్లా అధ్యక్షుడు, మండల ఆర్ఐ మరుపట్ల మల్లయ్య కోరారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కొందరు రెవెన్యూలో నూతన సంఘాలు ఏర్పాటు చేసి సంఖ్యా బలం నిరూపించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వారికి భయపడాల్సిన అవసరం లేదని, సభ్యత్వాలు ఎవరు తీసుకోవద్దని కోరారు. సమస్యల పరిష్కారానికి ట్రెంగ సంఘాన్ని స్థాపించినట్లు గుర్తుచేశారు. ఈ సంఘంలో మండల సర్వేయర్లు, ఎంపీఎస్ఓ, ఎస్ఏ, ఆర్ఐ, జేఏ, టైపిస్టులు, డ్రైవర్‌లు, రికార్డ్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినెట్లు, వాచ్‌మెన్ ఉన్నారని, నూతనంగా నాయబ్ తహసీల్దార్లతో కూడిన మరో సంఘాన్ని ఏర్పాటు చేయడంలో అంతర్యం ఏంటో చెప్పాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

బీడీ కార్మికులకు ఉపాధి కల్పించాలి

శాయంపేట : బీడీ పరిశ్రమను కుటీర పరిశ్రమగా పరిగణించి బీడీ కార్మికులకు ఉపాధి కల్పించాలని బీడీ అండ్ సిగార్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఎండీ.మక్రాం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్వీకే ఫంక్షన్ హాల్‌లో బీడీ కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభ ఏఐటీయూసీ మండల నాయకుడు బత్తిని సదానందం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. బీడీ కార్మికులకు కనీస వేతన జీఓ అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని అన్నారు. బీడీ కార్మికులకు నెలకు పది రోజుల పని కల్పిస్తున్నారని, ఇప్పటికైనా నెలకు 26రోజుల పని కల్పించి బీడీలకు సరిపడా తునికాకు, తంబాకు, దారం సరిపడా ముడి సరకులు కంపెనీలే సరఫరాల చేయాలని కోరారు. ఈపీఎఫ్ సంస్థల్లో పీఎఫ్‌కు రాజీనామా చేసిన బీడీ కార్మికులకు రూ.6వేల పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్ పరిధిలో 11 నెలల్లో నమోదైన చలాన్లు, జరిమానా వివరాలు

ఉల్లంఘన	ఈ-చలాన్లు	జరిమానా(రూ.ల్లో)	ఉల్లంఘన	ఈ-చలాన్లు	జరిమానా(రూ.ల్లో)
హెల్మెట్ లేకుండా..	4,44,493	7,41,29,800	రాంగ్ సైడ్ డ్రైవింగ్	13,242	26,31,400
డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా	37,986	37,93,900	రాంగ్ పార్కింగ్	10,463	20,92,600
సిగ్నల్ జంపింగ్	23,017	2,30,12,000	సెల్‌ఫోన్ డ్రైవింగ్	9,680	96,14,000
ఓవర్ స్పీడ్	17,269	1,72,59,000	విత‌వుట్ నంబర్ ప్లేట్	5,314	9,76,400
ట్రిపుల్ రైడింగ్	15,460	1,81,17,600			



అయినా.. తగ్గేదేలే!

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడంలో జెట్ స్పీడ్ చూపిస్తున్నారు. 11 నెలల్లో 8,08,826 ఈ–చలాన్లు నమోదుకాగా.. రూ.22,37,57,900 జరిమానా విధించారు. సగటున రోజుకు 2,450, నెలకు 73,529 చలాన్లు, జరిమానా రోజుకు రూ.ఏడు లక్షలకుపైగా, నెలకు రూ.రెండు కోట్లపైగా పడింది.

కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఉల్లంఘనులు

- 11 నెలల్లో 8,08,826 ఈ–చలాన్లు.. రూ.22 కోట్ల జరిమానా
- పోలీసులు అవగాహన కలిగిస్తున్నా మారని వాహనదారుల తీరు

సాక్షి, వరంగల్:

రోడ్డెక్కిన వాహనదారులు ఇంటికి సురక్షితంగా చేరుకోవాలంటే ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి. వారితోపాటు ఇతర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే క్షేమంగా గమ్యానికి చేరుకోవచ్చని వరంగల్ కమిషనరేట్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. అయినా చాలామంది అవేమీ తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు చోటు చేసుకుంటున్న ఘటనలే నిదర్శనం. ముఖ్యంగా బైక్ నడిపే వారు హెల్మెట్, కారు డ్రైవింగ్ చేసే వారు సీట్‌బెల్ట్ ధరించాలి. కానీ, వాహనదారులు అవేమీ పట్టించుకోవడం లేదు. అదేసమయంలో ట్రాఫిక్ జంక్షన్ల వద్ద అతివేగంతో సిగ్నల్ జంపింగ్ చేయడం, అత్యవసర పని ఉందంటూ రాంగ్ రూట్‌లో డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ పోలీసులు కెమెరాలకు పని చెబుతున్నారు. ఇలా ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు 8,08,826 ఈ–చలాన్లు జారీ చేసి రూ.22,37,57,900 జరిమానా విధించారు. అయినా వాహనదారుల్లో ఆశించినంత మార్పు కనిపించడం లేదు. దీంతో ఇటీవలి కాలంలో ప్రత్యేక డ్రైవ్‌తో వాహనదారులకు ఈ–చలాన్ల రూపంలో షాకిస్తున్నారు. సురక్షిత డ్రైవింగ్‌తో రోడ్డు ప్రమాదాలను అరికట్టడంపై దృష్టి సారించారు.

చిన్న నిర్లక్ష్యం.. భారీ మూల్యం



ఉరుకులు.. పరుగుల జీవితంలో వేగానికి ఉన్న ప్రాధాన్యం భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించక తప్పడంలేదు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. హెల్మెట్ లేకపోవడంతో చాలామంది రోడ్డు ప్రమాదాల్లో అక్కడికక్కడే మృతిచెందిన, గాయపడిన సందర్భాలు తరచూ చూస్తూనే ఉన్నాం. హెల్మెట్ వినియోగంపై అవగాహన లేని వాహనదారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. శరీరంలో అన్ని అవయవాల కంటే తలకు విశిష్టమైన స్థానం ఉన్న సంగతి తెలిసిందే. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మెదడుకు దెబ్బ తగిలినచోట ఉన్న కణాలుగా పిలిచే న్యూరాన్లు నశిస్తాయి. దీనివల్ల అవయవాలు శాశ్వతంగా చచ్చుబడిపోతాయి. కాబట్టి తలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

హెల్మెట్ తప్పనిసరి..



ద్విచక్రవాహనదారులు హెల్మెట్ కచ్చితంగా పెట్టుకోవాలని మోటారు వాహనాల చట్టం 1998లోని 129, 177 సెక్షన్లు చెబుతున్నాయి. దీని ప్రకారం వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 4,44,493 మంది ద్విచక్ర వాహనదారులకి రూ.7,41,29,800 జరిమానా విధించడం గమనార్హం. అదే సమయంలో 433 మంది పిలియన్ రైడర్(బైక్‌లో వెనకాల కూర్చున్నవ్యక్తి)లు హెల్మెట్ ధరించలేదని రూ.41,400 జరిమానా విధించారు. ఆ తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బండి నడిపినవారు, సిగ్నల్ జంపింగ్, ఓవర్ స్పీడ్, డేంజరస్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌తో ఉల్లంఘనలు చేస్తున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే..



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే. ఎవరైనా ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తున్నాం. మరోమారు పునరావృతం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ–చలాన్ల జారీలో వేగం పెంచాం. ఇంకోవైపు రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

– అంబర్ కిశోర్ ఝూ, వరంగల్ పోలీస్ కమిషనర్

పార్టీ బలోపేతానికి యువత కృషిచేయాలి

- పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

ఆత్మకూరు : పార్టీ బలోపేతానికి యువత కృషిచేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలానికి చెందిన పరకాల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్, జిల్లా ప్రధానకార్యదర్శి మంద శ్యామ్, కృష్ణకాంత్ తదితరులు ఆదివారం రాజేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చేతిలోనే దేశభవిష్యత్ ఉందన్నారు. యువత రాజకీయాల్లో రావాలని, ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. పేదల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేతో యూత్ కాంగ్రెస్ నాయకులు

రేవూరికి మంత్రి పదవి ఇవ్వాలి

ఆత్మకూరు : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ కోరారు. అన్నారం దర్గాలో రేవూరికి మంత్రి పదవి వరించాలని ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. న్యాయవాది సన్ని, నాయకులు నవీన్ గౌడ్, మహమ్మద్ ఖాలీమ్, తాజొద్దీన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మకూరు : నీరుకుళ్ల జెడ్పీహైస్కూల్‌లో 2004 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు సమ్మయ్య, బ్రహ్మయ్య, సిద్ధిరాజయ్య, లక్ష్మయ్య, వెంకన్న, నిర్మలాదేవి, మాధురిదేవిని సన్మానించారు. పూర్వవిద్యార్థులు ఆర్గనైజర్లు అర్షం రాజ్‌కుమార్, పత్తిపాక చంద్రశేఖర్, నరేష్, రాజు, మహేందర్, రాధిక, చంద్రమౌళి, రాజిరెడ్డి, మధు, రాజేష్‌ఖన్నా, అనిల్, శ్రీకాంత్, సవత, మమత, శిరీష, స్వప్న పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

వరంగల్ కోటలో పర్యాటకుల సందడి

ఖిలా వరంగల్: కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోటకు ఆదివారం భారీ సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో మధ్యకోట శిల్పాల ప్రాంగణం, ఏకశిల చిల్డ్రన్స్ పార్కు సందర్శకులతో కిటకిటలాడుతూ సందడి నెలకొంది. ఈ సందర్భంగా కోటలోని స్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని శిల్ప సంపద, ఖుష్‌మహల్, రాతి మట్టికోట కట్టడాలు, ఏకశిల గుట్ట అందాలను తిలకించారు. గుండు చెరువులో బోట్ షికారు చేశారు. సాయంత్రం టీజీటీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాకతీయుల చరిత్ర, వీరనారి రాణి రుద్రమాదేవి పోరాట పటిమను వివరించే సౌండ్, లైటింగ్ షోను కుటుంబ సమేతంగా తిలకించి సంతోషంగా వెనుదిరిగారు.



వందకు రూ.10 వడ్డీ..!

- శ్రుతిమించుతున్న వ్యాపారుల ఆగడాలు
- ఆస్తులు, వాహనాలు కుదువపెట్టుకుని డబ్బులు ఇస్తున్న వైనం
- దృష్టిసారించని పోలీసులు

వేలేరు : మండలంలో అక్రమ వడ్డీ వ్యాపారుల ఆగడాలు రోజురోజుకు శ్రుతిమించిపోతున్నాయి. వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కి అమాయకులు ఆర్థికంగా నష్టపోతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కొంతమంది వ్యక్తులు నూటికి రూ.10, ఆపైన వడ్డీ వసూలు చేస్తూ దందాకు తెరలేపారు. రోజు, వారం, నెలవారీ చిట్టీలు, ఫైనాన్స్‌ల పేరుతో చిరు వ్యాపారులు, కూలీలకు వడ్డీకి కొంత డబ్బులు ఇచ్చి అధిక వడ్డీ వాసులు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే డబ్బులు ఇచ్చే ముందు ఖాళీ ప్రామిసరీ నోట్‌లు, ఖాళీ చెక్కులు, ఏటీఎం, క్రెడిట్ కార్డులు, వాహనాలు, పట్టాదారు పాస్‌బుక్‌లు, బంగారు ఆభరణాలు, ఇతరాత్ర కుదువ పెట్టుకుని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. కుటుంబ అవసరాలు, వ్యాపారాల కోసం పేదలు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ అధిక వడ్డీ చెల్లిస్తూ నష్టపోతున్నారు. చేసిన అప్పులు తిరిగి చెల్లించలేక, వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఓ గ్రామంలో ఓ వ్యక్తి తన కుటుంబ అవసరాల నిమిత్తం రూ.1లక్ష అదే గ్రామానికి చెందిన వ్యక్తి దగ్గర రూ.10 చొప్పున వడ్డీకి తీసుకున్నాడు. ఇచ్చిన వ్యక్తి మొదటి నెల వడ్డీ కింద రూ.10 వేలు ముందుగానే తీసుకుని రూ.90 వేలు ఇచ్చి ఖాళీ ప్రామీసరీ నోట్‌పై సంతకం తీసుకున్నట్లు తెలిసింది. అప్పు తీసుకున్న వ్యక్తి మొదటి రెండు,మూడు నెలలు వడ్డీ సమయానికే చెల్లించినప్పటికీ తర్వాత డబ్బులు సమయానికి అందకపోవడంతో చెల్లించలేకపోయినట్లు తెలిసింది. దీంతో ఆ వ్యాపారి డబ్బులు చెల్లించాలని తీవ్ర ఇబ్బందులు గురి చేసి తన పలుకుబడితో అప్పు తీసుకున్న వ్యక్తి వాహనాన్ని లాక్కెళ్లినట్లు తెలిసింది. దీంతో బాధిత వ్యక్తి స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినట్లు సమాచారం.

అలుపెరుగని ప్రయత్నమే విజయ రహస్యం



నృత్యం చేస్తున్న చిన్నారులు

- కేయూ మాజీ వీసీ గోపాల్‌రెడ్డి

ధర్మసాగర్ : కలలు కనడమే కాదు వాటిని సాకారం చేసుకునేందుకు విద్యార్థులు నిరంతర సాధన చేయాలని కాకతీయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ గోపాల్‌రెడ్డి సూచించారు. మండలంలోని పెద్దపెండ్యాల శివారులో గల ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన 11వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఛేదించేందుకు కేవలం ఉపాధ్యాయులే కాకుండా తల్లిదండ్రులు కూడా క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. అంతకుముందు పాఠశాల చైర్మన్ రవికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. డీపీఎస్‌ను వరంగల్‌లో మొదటిస్థానం, తెలంగాణలో నాల్గో స్థానం, దేశంలో 47వ స్థానంలో నిలిపేందుకు కృషిచేసిన పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులు మొబైల్, ఇంటర్‌నెట్‌కు ఎక్కువగా వినియోగిస్తున్నారని, అవసరం మేరకే వాడాలని అన్నారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు కన్నేసి ఉంచాలన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ రాజిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఇన్నారెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో బీజేపీ నాయకుడు దాసరి సదానందం ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ కాజీపేటలో వందే భారత్ కోచ్ ఫ్యాక్టరీ, ఓవర్ ఆయిలింగ్ యూనిట్‌లను మంజూరు చేయడం సంతోషకరమని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వాసుల కలను సాకారం చేశారని అన్నారు. 40 సంవత్సరాలుగా ఏ ప్రధాని చేయని పనులను ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ అమలు చేసి భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా కృషి చేశారని అన్నారు. కాజీపేటతోపాటు పరిసర గ్రామాల యువతి, యువకులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయరావు, శుభాష్, మధు, శ్రీనివాస్‌రెడ్డి, సంపత్, యుగేందర్, రఘుధీర్, శ్రీనివాస్, రమణాకర్‌రెడ్డి, విజయ్, కిషన్, గోపి, శ్యాంసుందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవం

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు పరాశరం జయకృష్ణ ఆచార్యులు తెలిపారు. ధనుర్మాస ఉత్సవాలు నేటి నుంచి వచ్చే ఏడాది జనవరి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారుఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం, అధ్యయన ఉత్సవాలు, గోదా కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులుకావాలని పిలుపునిచ్చారు. భక్తుల రాకకు, ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



వైభవంగా దత్తసాయి జయంతి

- పాల్గొన్న కాంగ్రెస్ హుజూరాబాద్ ఇన్‌చార్జ్ ప్రణవ్, సీఐ హరికృష్ణ

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో షిరిడీ సాయిబాబా ఆలయంలో దత్తసాయి జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్దెత్తున సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్, కమలాపూర్ సీఐ హరికృష్ణ హాజరై సాయిబాబాను దర్శించుకున్నారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణలో భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. అనంతరం వారు కూడా భుజించారుఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు నవీన్‌కుమార్, దేవేందర్‌రావు, నాయకులు మహేష్‌కుమార్, రమేష్, ఓదెలు, వంశీధర్, రాజమౌళి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



ఉప్పల్‌లో అన్నప్రసాదాలు భుజిస్తున్న ప్రణవ్, సీఐ హరికృష్ణ

లారీ ఢీకొని మహిళకు గాయాలు

పరకాల : బొగ్గులారీ ఢీ కొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పరకాల పట్టణంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన గండ్ర సుధాకర్ రెడ్డి– ఇందిర దంపతులు ద్విచక్రవాహనంపై ఓ శుభకార్యానికి హాజరై తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో భూపాలపల్లి రోడ్డులోని పోచమ్మ గుడి వద్ద ద్విచక్రవాహనం రోడ్డు క్రాస్ చేస్తుండగా లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇందిర కాళ్లకు తీవ్ర గాయాలు కాగా సుధాకర్‌రెడ్డికి స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పరకాల పోలీసులు లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రెడ్‌క్రాస్ సేవలకు సంపూర్ణ సహకారం

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: హనుమకొండ రెడ్‌క్రాస్ కార్యాలయంలో నూతనంగా నిర్మిస్తున్న కార్యాలయానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ అభ్యున్నతికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. రెడ్‌క్రాస్ ముందు ఉన్న రహదారికి రెడ్‌క్రాస్ రెడ్డుగా పేరు మార్చాలని పాలకమండలి చేసిన ప్రతిపాదన అమలుకోసం కృషి చేస్తామన్నారు. తలసేమియా విషయంలో రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయమని కొనియాడారు. వారికి త్వరలో పింఛన్ అందేవిధంగా ప్రభుత్వం నుంచి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెడ్‌క్రాస్‌కు 10 అదనాతన పడకలను డాక్టర్ వీరమళ్ల చరణ్‌జిత్ రెడ్డి అందించారని అన్నారు. రెడ్ క్రాస్ సిబ్బందికి నివాస స్థలాల విషయంలో కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని అన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

సీపీఐలో చేరిక

న్యూశాయంపేట: పలు పార్టీలకు చెందిన ప్రజాసంఘాల నాయకులు ఏదునూరి వెంకట్రాజం, జుర్రు సంపత్ కుమార్‌తో పాటు తదితరులు ఆదివారం సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.